
క్లుప్తంగా

కుంకుళ్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం



టి.నరసాపురం : మండలంలోని బొ గ్రంపాలెంలో కొలువైన కుంకుళ్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కుంకుళ్లమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. వెలగపాడు, వీరభద్రవరం, బొర్రంపాలెం, శింగరాయపాలెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ



నూకాలమ్మ వారికి వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం : స్థానిక నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుందరంగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మ వారి రజత వస్త్రం తయారీకి తిరుపతి త్రిపురసుందరి, రమేష్ దంపతులు 10 తులాలు, బుట్టాయిగూడెంకు చెందిన జె.ధనలక్ష్మి 5 తులాల వెండి, సూరె భాస్కరరావు, సత్యవతి దంపతులు రూ. 10,116లు ఆలయ అభివృద్ధికి అందించినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ తెలిపారు. పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించగా, కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం, భక్తులు పాల్గొన్నారు.

ఫాతిమా మాత మహోత్సవం



దైవ సందేశం అందిస్తున్న విచారణ గురువు లినో

టి.నరసాపురం : మండలంలోని మల్లుకుంట ఆర్‌సీఎం చర్చిల్లో పరిశుద్ధ ఫాతిమా మహోత్సవం నిర్వహించారు. విచారణ గురువు లినో ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వాసులనుద్దేశించి ప్రసంగించారు. బైబిల్‌లోని దైవ సందేశాలను తెలియజేస్తూ ప్రతిఒక్కరూ దైవ మార్గంలో నడవాలని సూచించారు. లినో బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పోలీసు హెచ్చరిక



పవన్‌కుమార్, ఎస్సై

పోలవరం రూరల్: జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో, వాట్సాప్‌లో ఎటువంటి విద్వేషాలు, రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు పోస్ట్ చేస్తే ఆ గ్రూప్ అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ హెచ్చరించారు. బాణసంచా కాల్చడానికి, రోడ్లపై గుమ్మిగూడటానికి అనుమతులు లేవని, 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్, ఎలక్షన్ కోడ్ కూడా అమలులో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలో రైల్వే బ్రిడ్జి జాతీయ రహదారిపై యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులిచ్చిన సమాచారంతో ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాలు వయస్సు ఉన్న వ్యక్తి మెడలో రుద్రాక్ష మాల ఉందని, ప్యాంట్ షర్ట్ ధరించి ఉన్నాడని, చెవిపోగులు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్సై సెల్ నెంబర్ 94407 96636కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యాపార ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి

పెదపాడు: వ్యాపారులు తమ వ్యాపార స్థలాల్లో తప్పకుండా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులో ఆయన పారిశుధ్య పరిస్థితులను, అనంతరం ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శీతల పానీయాలు తాగిన గ్లాసులు గుట్టలుగా పడేయడాన్ని గమనించారు. కూల్ డ్రింక్ వ్యాపారం చేసేవారు పేపరు గ్లాసులను పక్కనే పడేయడంతో వారితో మాట్లాడి బాధ్యతారాహిత్యంగా మెలగడంపై మండి పడ్డారు. ప్రజాఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ వ్యాపారాలు చేస్తే ఊరుకునేది లేదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ కూల్ డ్రింక్ వాహనానికి తాళం వేశారు.

వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి

- మండుతున్న ఎండలతో ప్రజల బెంబేలు
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



ఉదయం 9 గంటలకే నిర్మానుష్యంగా ఉన్న చింతలపూడి-ఏలూరు ప్రధాన రహదారి

చింతలపూడి : గత నాలుగు రోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఒకపక్క భూమిలో నుంచి వచ్చే సెగలు, మరో పక్క పై నుంచి నిప్పులాంటి ఎండ వేడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ప్రకటించడంతో జనం కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతుండటం చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఒక్కసారిగా పెరిగిన ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 8 గంటల నుండే ప్రజలు సూర్య తాపాన్ని తట్టుకోలేక పోతున్నారు. 38 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఎండల నుంచి రక్షణ పొందేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొందరైతే ఎండలకు భయపడి ఇళ్ల వద్దే కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఎండలకు మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం అంతగా కనిపించడం లేదు. ఒకవేళ బయటకొస్తే పళ్ల రసాలు, కొబ్బరి బొండాలు, చెరుకు రసం, చల్లని శీతల పానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. రోడ్లు మండుతున్న కొలిమిలాగ మారడంతో వాహనదారులైతే పగటి పూట చుక్కలు చూస్తున్నారు. వడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి కిరణ్ చైతన్య సూచిస్తున్నారు.

జాగ్రత్తలు

- తొలకరి వానలు కురవడం ప్రారంభమైతే ఎండలు తగ్గుముఖం పడతాయి. అప్పటి వరకు ప్రజలు ఎండల్లో తిరక్కుండా జాగ్రత్తలు పాటించాలి.
- వీలైనంత వరకు పసి పిల్లలు, వద్ధులు ఎండలో తిరగొద్దు. వీరు గాలి ఆడే చల్లని ప్రదేశాల్లో ఉండాలి. నీరు ఎక్కువగా తాగాలి.
- స్థూలకాయులు, మద్యం ఎక్కువ సేవించేవారు, జ్వరం, విరేచనాలతో బాధపడుతున్న వారు వడ దెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వీరు ఎండలోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బిగుతుగా ఉండే దుస్తులు ధరించకూడదు.
- ఎండక్కువగా తగులుతూ, గాలి అందని చోట పనులు చేయకూడదు. ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తరువాత పనులు చేసుకోవడం మంచిది.
- ఎండాకాలంలో తెల్లని లేత రంగు దుస్తులు ధరించాలి. నైలాన్, టెర్లిన్, టెరికాట్ దుస్తులు ధరించకూడదు. కాటన్ దుస్తులు ధరించడం మంచిది.
- పసిపిల్లలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తడిగుడ్డతో తరచూ తుడుస్తూ ఉండాలి. బయటకు తీసుకెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లాలి.
- ప్రతి రోజూ రెండు పూటలా స్నానం చేయాలి. తేలికగా అరిగే ఆహారం తీసుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

గత నాలుగు రోజుల్లో మెట్ట ప్రాంతంలో నమోదైన ఉష్ణోగ్రతలు

మంగళవారం	41 డిగ్రీలు
బుధవారం	40 డిగ్రీలు
గురువారం	42 డిగ్రీలు
శుక్రవారం	42 డిగ్రీలు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

లింగపాలెం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశానికి వెంకటలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, మంచినీరు సరఫరా చేసే ట్యాంకులను శుభ్రపరచాలని, తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, రైతులకు పలు సూచనలు, సలహాలను అధికారులు తెలియజేసినట్టు చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి జాన్సి, ఎంపీడీఓ వి.రాంబాబు, వివిధ శాఖల మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 సీహెచ్ నరేంద్రరాయ్

పోలవరం రూరల్: పోలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2లో శుక్రవారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శిక్షణ ఇచ్చామని ఎంఈఓ జె.సురేష్ బాబు తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు నూతన విద్యాసంవత్సరం నుంచి పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన పరిశుభ్రమైన నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించామన్నారు. ఎంఈఓ-2 సీహెచ్ నరేంద్రరాయ్ మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ, వంట చేసే విధానాన్ని వివరించామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా పాఠశాల ప్రారంభం తరువాత మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోలులో అప్రమత్తత అవసరం





ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్న ఎరువులు, పురుగు మందులు

బుట్టాయగూడెం : ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడం, రుతుపవనాలు కూడా రాష్ట్రంలోకి ప్రవేశించాయని, అధికా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసే ప్రకటనతో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు దుక్కులు దున్నుతూ భూమిని సిద్ధం చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ సాగులో విత్తనాల ఎంపికే కీలకమని, పురుగు మందులు, ఎరువులు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ సొసైటీల వద్ద ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు చేయడం మేలని సూచిస్తున్నారు.

గుర్తింపు ఉన్న చోటే కొనాలి

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనాలి. విత్తనాల సంచిపై విత్తన రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలు ఉన్నవీలేనివి తప్పనిసరిగా గమనించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన బిల్లులపై తప్పని సరిగా డీలరు సంతకం ఉండాలి. రసీదు తప్పని సరిగా తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది. హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనం రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్య నాణ్యత వంటి వివరాలను నిర్ధారించుకోవాలి. మొలకెత్తే దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

నిబంధనలు తప్పనిసరి

ఎరువులు విక్రయించే వారు తప్పని సరిగా ప్రభుత్వం నుంచి గుర్తింపు పత్రాలు పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులు, వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ప్రమాణం లేని ఎరువులను డీలర్లు విక్రయించరాదు. బస్తాలపై చట్ట ప్రకారం నిర్దేశించిన ప్రామాణికాలు లేని ఎరువులను విక్రయించరాదు. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్ర సిరాతో గుర్తు వేసి పక్కన పెట్టాలి. అటువంటి వాటిని రైతులు కొనుగోలు చేయరాదు.

విత్తన శుద్ధి ఇలా..

కిలో విత్తనాలు రెండున్నర గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెడితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైజం కలిపి ఆ ద్రవణంలో 24 గంటలు నానబెట్టి మడి కట్టి నారుమడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది. కార్బండైజం కాకుండా విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరసెస్ అనే జీవ శిలీంద్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఈ జీవ శిలీంద్ర నాశిని వ్యవసాయశాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. సూడోమోనాస్ ఫ్లోరసెస్ మందును కేజీ విత్తనాలకు 8 గ్రాముల మందును వినియోగించాలి. దీనివల్ల విత్తనం ద్వారా, భూమి నుంచి శిలింద్రం ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు.

మొలక పరీక్ష తప్పనిసరి

రైతులు సొంత విత్తనాలు వినియోగించుకోవడం మంచిది. మొలక పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి. రైతులు విత్తకోవడానికి ఒకరోజు ముందు విత్తనాలను కొనడం వల్ల మొలకశాతం పరీక్షించడం లేదు. ఇది మంచి సరికాదు. విత్తనం కొన్న తర్వాత మొలకశాతాన్ని పరీక్షించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజలు పైబడి మొలకవస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకోవాలి. నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. లేదంటే విత్తన బస్తాను తిరిగి కొనుగోలు చేసిన చోటే ఇచ్చేయాలి.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



రైతులు విత్తనం ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు వస్తాయి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఎరువులు, విత్తనాల కొరతలేకుండా తగు చర్యలు చేపట్టడం జరుగుతుంది.

– డి.ముత్యాలరావు, వ్యవసాయ శాఖ అధికారి, బుట్టాయగూడెం మండలం

హనుమద్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధం



ఆలయంలో కొలువైన ఆంజనేయ స్వామివారు



ద్వారకాతిరుమలలో ముస్తాబవుతున్న ఆంజనేయుని ఆలయం

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం హనుమద్ జయంతి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సిబ్బంది శుక్రవారం ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి డొప్పలు, విద్యుద్దీప తోరణాలు, పచ్చిపూలతో శోభాయమానంగా అలంకరించారు. శనివారం హనుమద్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

యాదవులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ఏలూరు (టూటౌన్): యాదవులు అంతా ఐకమత్యంతో రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోవాలన్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో యాదవులు రాణించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యాదవ జాతి అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యావిధానంలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సబంధించిన శనివారం నుంచి ప్రారంభించే సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంను కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ ఇంటర్ పేరుతో జిల్లాలో ఉన్న కొన్ని ప్రత్యేక సెంటర్ల (స్కూల్, కాలేజీ) యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని పేర్కొన్నారు. అయితే విద్యార్థులు కూడా పాస్ గ్యారెంటీ అని ఆశపడి యాజమాన్యాలు ఎంత అడిగితే అంత రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు చెల్లించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం డిస్టెన్స్ ఇంటర్మీడియట్ విద్యకు రూ.3000 లోపు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. నాయకులు కాకి నాని, ఎం.క్రాంతి, ఎం రేవంత్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : వడ్డీ వ్యాపారస్తుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న పాకుర్ల వెంకన్నబాబు కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మాదేపల్లి పంచాయతీ పరిధిలోని లింగారావుగూడెం గ్రామానికి చెందిన పాకుర్ల వెంకన్నబాబు (33) దళిత సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులకు బలైపోయాడని వాపోయారు. వెంకన్నబాబుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, బాధిత కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వం కోరారు. వడ్డీ వ్యాపారస్తులు అప్పు సొమ్మును రాబట్టుకునేందుకు ఇంటి వద్ద ఉన్న ఆటోను బలవంతంగా స్వాధీనం చేసుకొని తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురైన వెంకన్నబాబు మే 30వ తేదీ గురువారం సాయంత్రం నిద్ర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. వెంకన్నబాబు మరణానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సీహెచ్ అమర్ కుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు వెంకన్నబాబు కుటుంబాన్ని పరామర్శించి తమ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న పొగాకు వ్యతిరేక దినోత్సవం

కొయ్యలగూడెం : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం బయ్యనగూడెం పీహెచ్‌సీలో నిర్వహించారు. వైద్యాధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పొగాకు వినియోగం వల్ల ప్రపంచ ఎదుర్కొంటున్న సమస్యలు, మానవాళికి పొంచి ఉన్న ముప్పు, ఆర్థికపరమైన ఇబ్బందులపై అవగాహన కల్పించారు. చుట్ట, సిగరెట్, ఖైని, పాన్ పరాగ్ వంటి ప్రాణాంతక మైనవి వినియోగిస్తూ క్యాన్సర్ వ్యాధులకు బలై కుటుంబాలకు దూరమవుతున్నారని హెచ్చరించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి



జంగారెడ్డిగూడెంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. మురళీకృష్ణ, మహేష్ యువసేన అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో అన్నదానం చేశారు. తెలుగువారి ఆరాధ్య నటుల్లో కృష్ణ ఒకరని, ఆయనను స్మరించుకుంటూ కృష్ణ అభిమాన సంఘాలు చలివేంద్రాలు, రక్తదానాలు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏడాది పొడవునా చలివేంద్రం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, మహేష్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇద్దరు వ్యక్తులను కొట్టి గాయపర్చిన నేరానికి సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన పి.జయప్రశాంత్ చెల్లెలితో మల్లిపూడి రవితేజకు ప్రేమ వివాహం జరిగిందన్నారు. జయప్రశాంత్ చెల్లెలు ఇటీవల డెలివరీ నిమిత్తం పుట్టింటికి వచ్చిందని తెలిపారు. రవితేజ చెడు అలవాట్లకు బానిసై, ఈ నెల 29వ తేదీన జయప్రశాంత్‌కు ఫోన్ చేసి రూ.10 వేలు కావాలని అడిగాడని పేర్కొన్నారు. సొమ్ములు ఇవ్వకపోవడంతో జయప్రశాంత్ ఇంటి వద్ద ఉన్న భార్యను బలవంతంగా రవితేజ తీసుకెళుతుండగా, జయప్రశాంత్, అతని సోదరుడు అడ్డుకున్నారని తెలిపారు. దీంతో వారిపై రవితేజ దాడి చేశారని చెప్పారు. గాయపడిన జయప్రశాంత్, అతని సోదరుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై చెప్పారు.

రత్నగ్రేస్ హత్య దారుణం

ఏలూరు (టూటౌన్): మహిళలపై జరిగే హత్యలు, అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతు కోసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చినా వాటి వల్ల మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ దొరకడం లేదని తెలిపారు. మహిళలు అన్యాయం జరిగితే వెంటనే పోలీసులను కలిసినా శిక్షించే విధంగా చట్టాల్లో మార్పులు తేవాలని ఆయన కోరారు. పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లాల్సిన రత్నగ్రేస్ మృత్యుఒడిలోకి చేరుకోవడం బాధాకరమని, ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని, అమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. రత్నగ్రేస్ కుటుంబాన్ని ఆదుకోవాలని రవి ప్రభుత్వాన్ని కోరారు.